# గుర్తు

వంటగది గుమ్మంలో దిగులుగా కూర్చుని వుంది రాజేశ్వరమ్మ.
గాలికి ఎగురుతూన్న చీరకొంగూ.. కళ్ళల్లో మెరుస్తూన్న నీటి పొంగూ చెప్పేస్తున్నాయి కానీ లేకపోతే అసలు ఆమె ఓ ప్రాణమున్న మనిషేనా! అనిపిస్తుంది.
గుమ్మానికి అవతల వున్న నిలువుటద్దంలోనుండి కనిపిస్తోంది ఆమె ప్రతిబింబం.
కన్నీళ్ళు తోడిపోయడమే తప్ప కదలడం తెలియని కష్టజీవుల్లా ఆమె కనుపాపలు చాలాసేపటి నుండీ అటే చూస్తున్నాయి. ఎంత వెలితి ఆ ప్రతిబింబంలో!
ఉదయాకాశం లాంటి నుదుటిపై మొన్నమొన్నటివరకూ భానుబింబంలా భాసించిన సింధూరం యిపుడు లేదు.
చురుకుగా క్షణం ఆగకుండా కదిలే చేతులని యెప్పుడు కౌగలించుకున్నాయో అని ఆశ్చర్యపోయేలా.., ఇంత మధుర శబ్దాన్నిచ్చే వాయిద్యాన్ని యింతవరకూ ఏశాస్త్రవేత్తా కనిపెట్టలేదేమో అని దిగులుపడేలా.., గలగలలాడుతూండే గాజులు యిప్పుడు లేవు.
నిశ్శబ్దపు చీకటిలో నిండుగా సాగే నదిని నాజూగ్గా చుట్టేసిన వెన్నెలకిరణంలా వెలిగిపోయే పూలమాలా లేదు.
మాధవరావు మరణం ఆమెలోని చైతన్యపు అగ్నిని ఆర్పేసి నైరాశ్యపు మసిని మిగిల్చినట్లుగా వుంది.
నెలరోజుల క్రితం.. అర్ధరాత్రి .. భర్తని హాస్పిటల్ కి తీసుకువెళ్తూన్నపుడే భవిష్యత్తు లీలగా ఆమె మనసుకు తట్టింది. అందుకే.. అక్కడికి వెళ్ళిన కాసేపటికే మాధవరావు మరణించాడంటే.. ఆమెకు ఆశ్చర్యం కలగలేదు. బాధా తెలియలేదు.
ఇంకా చెప్పాలంటే మనసు మారుమూలల్లో ఎక్కడో ఆనందం లాంటి భావన కలిగింది.
ఆనందం!!!
మాధవరావు తప్ప మరేమీ తెలియనట్లుండే రాజేశ్వరి., ముప్పై ఏళ్ళ క్రితం అతన్ని ప్రేమించి అతని కోసం అందరినీ ఎదిరించి వచ్చేసిన రాజేశ్వరి..,
తనూ.. తన పిల్లలూ.., తను వున్న యిల్లూ., తను ప్రేమించే సమస్త విషయాలూ.. వీటన్నిటి వెనుకా మాధవరావు తప్ప మరేమీ లేని రాజేశ్వరి..,

మాధవరావు చనిపోతే ఆనందిస్తుందా!
లేదు. అది ఆనందం కాదు.
మరి!
చాలారోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న భర్త. . ఆ బాధ నుండి విముక్తుడయ్యాడన్న నిశ్చింతా!
కాదు. అదికూడా కాదు.
ఆలోచిస్తూంటే రాజేశ్వరికి అసలు ఆరోజు ఆవిషయం సరిగా అర్థం కాలేదనిపిస్తోంది.
మాధవరావు మరణించడం అంటే. .
వరండాలో ఎప్పుడూ వాల్చివుండే మంచం యికమీదట ఎత్తిపెట్టడం అనుకుంది కాబోలు రాజేశ్వరి.
అందుకే ఆరోజు కోడలితో సహా అందరూ కదలి కదలి ఏడ్చినా . . ఆమెకు మాత్రం కంటిలో నీరు కూడా తిరగలేదు. పదిరోజుల పాటు బంధువులు పరామర్శలూ, పలకరింపులూ చేస్తుంటే. . పరాకుగా చూసిందే కానీ. . వాళ్ళు తనని ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారన్న భావం ఆమెకు కలగలేదు.
పదిరోజుల తర్వాత. . ఆరోజు. .
ఆమె పసుపు కుంకుమలు తీసేస్తుంటే. . అపుడు అర్థమయింది ఆమెకు హటాత్తుగా. . "మాధవరావు చనిపోవడం" అంటే ఏమిటో!
అప్పుడు మొదలయింది ఆమెలో నిజమైన విచారం. ఆమెను రోజురోజుకీ. . పూటపూటకీ కృంగదీసే విషాదం.
ఆమె బాధని అర్థం చేసుకున్న ఆత్మీయులు ఆమెకు ఓదార్పు చెప్తూనే ఉన్నారు.
ముఖ్యంగా కోడలు. .
మాధవరావు చనిపోయాక జానకి అత్తగారికి బాగా దగ్గరయింది. అయిదు సంవత్సరాలుగా గెలుచుకోలేకపోయిన అత్తగారి మనసును ఆమె తన ప్రేమతో, ఆదరణతో ఈపదిహేనురోజుల్లోనూ గెలుచుకుంది.
రాజేశ్వరి గయ్యాళి కాదు. కానీ మాధవరావు మరణానికి ముందు ఆమె యిలా వుండేది కాదు.

అందరి మీదా అజమాయిషీ చేస్తూ, అన్ని పనులూ తన నోటిమాటతో జరిపిస్తూ హడావుడిగా తిరుగుతూండేది.

కొడుకు, కోడలే కాదు.. మాధవరావు కూడా ఆమె మాటకి ఎప్పుడూ ఎదురుచెప్పేవాడు కాదు.

ఆమెతో గారంగా వాదనలు పెట్టుకోగల శక్తీ, ఆమెచేత ఆమెకి యిష్టంలేని పనులు సైతం చేయించగల యుక్తీ, చిన్నకొడుకు సుధాకర్ కి మాత్రమే వుండేవి.

అలాంటి అత్తగారు.. యిపుడు, మాటలే మరచిపోయినట్లూ, తన ప్రాణాలే తనని కాల్చేస్తున్నట్లూ కూర్చోవడం చూస్తే జానకి గుండె తరుక్కుపోతోంది.

ఇంతకుముందు అత్తగారి అజమాయిషీని, అహంకారాన్నీ ఆమె ఎలా భరించిందో, ఏమనుకుందో తెలీదు కానీ.. యిపుడు మాత్రం.. ఆవిడ లేచి తిరగాలనీ, యిదివరకులా ప్రవర్తించాలనీ మనస్పూర్తిగా కోరుకుంటోంది.

అందుకు తాను చేయగలిగిన ప్రయత్నాలన్నీ చేస్తోంది కూడా. ఆరోజు కూడా భర్త ఆఫీసు నుంచి రాగానే చెప్పింది ఆమె. "మీ అమ్మగారు రోజురోజుకీ దిగులు పెంచుకుంటున్నారండీ. ఏమీ తినడం లేదు. త్రాగడం లేదు. అసలు మాట్లాడటమన్నా లేదు. నాకు భయం వేస్తోంది ఆవిడని చూస్తుంటే.."

నిర్లిప్తంగా చూసిన శ్రీధర్ కళ్ళల్లో "నేనేం చేయగలను!" అన్న భావం గమనించి మళ్ళీ చెప్పిందామె.

"మీరు వెళ్ళి ఆవిడ దగ్గర కూర్చుని కాసేపు మాట్లాడండి. ఎంత చేసినా.. ఎలా చూసినా.. నేను పరాయిదాన్నే కదా! ఆవిడ బాధని మరిపించేంత చనువు నాకు లేదు."

ఆమె మాటల్ని మధ్యలోనే ఆపుతూ అన్నాడు శ్రీధర్ "నాకు మాత్రం వుందా! తమ్ముడికి తప్ప ఎవరికీ లేదు అమ్మ దగ్గర చనువు."

"నిజమే. సుధాకర్ త్వరగా వచ్చేస్తే బాగుండు. అపుడన్నా మీ అమ్మగారు కాస్త మనుషుల్లో పడతారేమో! అసలు మామగారు పోయినపుడు సుధాకర్ దగ్గరలేకపోవడం.,

నెలరోజులయినా తనని చూడకపోవడం.., యిదే సగం దిగులు అనుకుంటా ఆవిడకి."

"అయ్యిండొచ్చు" చిన్నగా నిట్టూర్చాడు శ్రీధర్. "వాడు ఉద్యోగం అంటూ అంతదూరం వెళ్ళేటపుడు అమ్మ గొడవచేస్తే చాదస్తం అనుకున్నాం. కానీ యిపుడనిపిస్తోంది. అంతదూరం వెళ్ళబట్టే కదా! వాడికి నాన్నగారి చివరిచూపు దక్కకుండా పోయింది."

"చాల్లే వూర్కోండి" అంది జానకి. "అతనికి సెలవు దొరకక రాలేకపోయాడు గానీ దూరం ఏముంది! ఆమాత్రం దూరం కూడా వెళ్ళం అంటే ఈరోజుల్లో ఉద్యోగాలు ఎలావస్తాయ్!"

శ్రీధర్ మాట్లాడలేదు. చాలాసేపు మౌనంగా కూర్చుండిపోయి, ఆతర్వాత మెల్లగా తనలో తనే అనుకుంటున్నట్టుగా అన్నాడు. "అయినా నాన్నగారు చనిపోయిన రోజు అమ్మమొహంలో కాస్తయినా బాధ కనిపించలేదు. ఇపుడేమో యిలా కృంగిపోతోంది. చిత్రంగా లేదూ!"

" అవునండీ." జానకికూడా అప్రయత్నంగా గొంతు తగ్గించింది. "మనం అప్పటివరకూ ఆవిడ మామగారిపై చూపించే విసుగే చూశాం. అందుకే ఆరోజు ఆవిడ ఎంతటి షాక్ కి గురయిందీ వూహించలేకపోయాం. కానీ యిప్పుడు అర్థం అవుతోంది.. మామగారిమీద ఆవిడకి ఎంతప్రేమ వుందో! ఆవిడని అపార్థం చేసుకున్నందుకు నేను బాధపడని క్షణంలేదు నిజంగా."

చిన్నగా నవ్వాడు శ్రీధర్. తన మనసులోని మాట జానకి నోటివెంట వచ్చినట్టుగా అనిపించింది అతనికి. కాని అతనికీ జానకికీ కూడా తెలియని విషయం ఒకటుంది. మాధవరావు చనిపోయే రోజుకి రాజేశ్వరికి నిజంగానే భర్త అంటే ఒకరకమయిన అనాసక్తత వుంది.

మాధవరావు అనారోగ్యం.. ఆర్థిక యిబ్బందులూ.. ఆమెపై పడిన బాధ్యతలూ.. తను కాబట్టి అంతా సమర్థించ గలుగుతున్నానన్న అహంకారం.. యివన్నీ కలిసి అతనిమీద ఆమెకున్న ప్రేమని కప్పిపెట్టేశాయి.

భర్తని సాధించడం, విదిలించడం చాలా సాధారణ విషయాలు అయిపోయాయి. చివరికి మాధవరావు చనిపోవడానికి ముందురోజు రాత్రి కూడా ఆయనతో తను వాదన పెట్టుకోవడం, నిష్టూరంగా ఏదో అని లోపలికి వెళ్ళిపోవడం రాజేశ్వరికి గుర్తుంది. ఆ ఆవేశంలో తను ఏం మాట్లాడిందో మాత్రం గుర్తు లేదు.

ఆ మాటలు.. మాధవరావుని మరణం వైపు తరిమిన ఆమాటలు..
మాధవరావు చనిపోయిన పదిహేను రోజుల తర్వాత కనబడ్డాయి ఆమెకి.. అతని డైరీలో.. ఆఖరి పేజీలో.
"ఈ రోజు కూడా రాజీ తన చల్లటి చేతుల్తో అన్నం తినిపించింది. తినిపిస్తున్నంత సేపూ యధాప్రకారం సాధిస్తూనే వుంది. కళ్ళల్లోనుంచి అదేపనిగా కారే నీటిని ఎర్రటి చీరకొంగుతో తుడుచుకుంటూ.. అసలే ఎర్రనయిన ముక్కుని యింకా యింకా ఎర్ర బడేసుకుంటూ ఒకమాటంది ఈరోజు.
"నుదుటి మీద యింత కుంకుమ అద్దుకుంటే సరిపోయిందా! మొగుడనేవాడు వుండడం వల్ల నాకేం ఒరుగుతోంది కనుక!" అని.
ఎంత బాగా చెప్పింది! నిజమే. బొట్టు కాటుక పెట్టుకునే అవకాశం తప్ప రాజీకి తను యిస్తున్నది ఏముంది! అవికూడా తను యిచ్చినవి కావు. ఆమెకి పుట్టినప్పటినుంచీ వున్నవే. పాపం. పిచ్చి రాజీ. అలంకరణ మీద విపరీతమయిన మమకారం ఉండబట్టి కానీ.. ఆ మమకారమే వదిలేసుకోగలిగితే!!
తను మాత్రం ఎంత వెర్రివాడు! తనతో మాట్లాడటం ఎపుడో మర్చిపోయిన కొడుక్కి.., యింకా ఎన్నాళ్ళు మోయాలి అన్నట్లు మూలిగే మంచానికే తను బరువు అనుకున్నాడు గానీ.. రాజీకి .. తన రాజీకి కూడా తను బరువుగా వున్నాడని యిన్నాళ్ళూ తెలుసుకోలేకపోయాడు.
పోనీ యిపుడు తెలిసిందిగా!
మరి ఈ సిగ్గులేని ప్రాణం యింకా పోదే! అబ్బ!.. ఏమూలో కలుక్కుమనే ఈనెప్పి ఇంకొంచెం ఎక్కువగా, గుండె ఆగిపోయేంత వుధృతంగా రాకూడదూ!
కన్నీళ్ళతో కలిసి జారుతున్న ఈ స్వేదబిందువులు శరీరాన్ని చల్లబరిచేంతగా పారకూడదూ!..."
అక్కడివరకే వుంది డైరీలో. ఏదేవుడు అతని కోరిక తీర్చాడో కాని అంతటితో ఆగిపోయాయి వాక్యాలు.
అప్పుడు బ్రద్దలయ్యాయి రాజేశ్వరిలో.. అప్పటివరకూ ఆమెకే తెలియకుండా వున్న అహంకారపు అగ్నిపర్వతాలు.
అప్పటినుంచీ ఆమెమనసు అలా కాలిపోతూనే వుంది. గుర్తొచ్చిన ప్రతి సంఘటనా ఆమెని కుళ్ళబొడుస్తోంది.

చివరికి భర్తని హాస్పిటల్ కి తీసుకెళ్ళాక కూడా తను ఆయనదగ్గర కూర్చోలేదు. ఆ మందులవాసనలో వుండలేనంటూ బయటకి వచ్చేసింది.

చనిపోయేముందు ఒక్కసారి కళ్ళు తెరిచి "రాజీ.. రాజీతో మాట్లాడాలి" అంటూ భర్త కలవరించడం..

జానకి పరుగెత్తుకుంటూ వచ్చి తనని పిలవడం.. తను లోపలికి వెళ్ళేసరికే ఆయన ప్రాణం పోవడం..

తల్చుకున్న కొద్దీ దుఃఖం వెల్లువవుతోంది. ఏం మాట్లాడాలనుకున్నారో ఆయన!

వంటగది గుమ్మంలో కూర్చుని నిశ్శబ్దంగా ఏడుస్తూన్న అత్తగారిని చూస్తే జానకి కళ్ళల్లో కూడా  నీళ్ళు తిరిగాయి.

"ఎలా ఓదార్చాలి ఈవిడని! " బాధగా అనుకుంది ఆమె మరోసారి, "సుధాకర్ త్వరగా వచ్చేస్తే బాగుండును." అని.

ఆమె ఆశ రెండురోజుల తర్వాత తీరింది కానీ ఆమె ఆశించినట్టుగా మాత్రం జరగలేదు.

*****

సుధాకర్ వచ్చినా రాజేశ్వరిలో మార్పేమీ లేదు.

నెలరోజుల తర్వాత.. దాదాపుగా కుదుటపడిన మనసుతో వచ్చిన సుధాకర్ కి..

తండ్రి మరణం యదాతథంగా.. నిజానికి యింకొంచెం ఎక్కువ బాధాకరంగా..

భూతద్దంలో చూసినట్టుగా కనపడింది తల్లిరూపంలో..

అతను రాగానే మళ్ళీ ఒకసారి రోదనలతో.. ఓదార్పులతో యిల్లు మార్మోగింది.

ఆతర్వాత మళ్ళీ మామూలే..

రాజేశ్వరి అతనితో కూడా ఎక్కువగా మాట్లాడలేదు. తల్లిలోని మార్పు చూసి సుధాకర్ వణికిపోయాడు.

"ఎందుకిలా అయిపోయింది అమ్మ" అన్న ఆలోచన అతన్ని నిలువనీయలేదు.

వచ్చిన మూడురోజులకి..

జానకి బియ్యం ఏరుతూండేటే.. మెల్లగా వచ్చి ఆమె ప్రక్కన కూర్చుంటూ అడిగాడు సుధాకర్. "వదినా! అమ్మ మామూలుగా బొట్టూ అవీ పెట్టుకుంటే ఏమవుతుంది! "అని.

చివ్వున తలెత్తింది జానకి. నీకేమయినా పిచ్చెక్కిందా అన్నట్లు చూసింది.
అది గ్రహించి నచ్చచెపుతున్నట్లుగా అన్నాడు అతను.
"అదికాదు వదినా! అమ్మని ఇలా చూడలేకపోతున్నాను. నాన్న పోయినంత మాత్రాన అమ్మ అవన్నీ ఎందుకు వదిలేసుకోవాలి చెప్పు! అసలు ఆ దిగులుతోనే.. తనని తాను చూసుకోలేకే అమ్మ అలా అయిపోయిందనిపిస్తోంది నాకు. అలంకరణ అన్నా.. పూలన్నా అమ్మకి ఎంత యిష్టమో నీకు తెలుసు కదా!.."
జానకి ఆలోచనలో పడింది. "తనకు ఎందుకు తెలీదు! తెలుసు. ఎంతో కోపం వచ్చిన రోజూ.. జ్వరంతో కాలిపోతున్న రోజూ కూడా అత్తగారు పూలు పెట్టుకోకుండా వుండేది కాదు.
పూలు అమ్మే అమ్మాయి రోజూ అలవాటుగా యింట్లో పూలు యిచ్చేసి వెళ్ళేది. ఏరోజయినా ఆఅమ్మాయి రావడం కాస్త ఆలశ్యం అయితే అత్తగారు పదిసార్లు తల్చుకునేది. అదంతా తనకి తెలుసు.
కానీ.. ఆదిగులుతో ఎవరయినా అలా అవుతారా! భర్త వుండగా వాటన్నిటి మీదా ఆవిడకి ఎంతో యిష్టం వుండి వుండవచ్చు. అంతమాత్రం చేత ఆయన పోయాక కూడా అవన్నీ పెట్టుకుంటే ఆనందంగా వుండగలదనుకోవడం..."
సుధాకర్ అమాయకత్వానికి నవ్వొచ్చింది జానకికి.
"ఏమిటయ్యా నీ పిచ్చి! మీ అమ్మగారు ఒప్పుకుంటారనుకున్నావా అసలు!" మందలించింది.
సుధాకర్ ఆశ్చర్యపోయాడు. "అదేమిటి! ఎందుకు ఒప్పుకోదు!"
"ఒప్పుకోరు. ఆవిడకి పసుపు కుంకుమలంటే యిష్టం కాబట్టే.. వాటి విలువ తెలుసుకాబట్టే.. అసలు ఒప్పుకోరు." ఖచ్చితంగా చెప్పింది.
చివాలున లేచి నిలబడ్డాడు సుధాకర్ "మీరెవ్వరూ ఏమీ అనరు అంటే నేను ఒప్పిస్తాను వదినా!" అనేసి జానకి వారించేలోపే లోపలికి వెళ్ళిపోయాడు.
వంటగది గుమ్మంలోనే కూర్చుని వుంది రాజేశ్వరి, శూన్యంలో చిక్కబడిన చూపుల్తో.. ప్రాణం వుందా లేదా అనిపించేట్లూ.. ఊపిరి తీసుకోవడమే మరచిపోయినట్లూ.
ఆమె ప్రక్కనే చతికిలపడుతూ పిల్చాడు సుధాకర్ "అమ్మా!" అని.
రాజేశ్వరి పలకలేదు. ఇంకొంచెం దగ్గరగా జరిగి, ఆమె భుజం చుట్టూ చేయివేస్తూ అడిగాడు, "అమ్మా! నీకొక మాట చెప్పనా!"

ఏ భావమూ పలకలేదు ఆవిడ మొహంలో. చిన్నగా నిట్టూర్చాడు సుధాకర్.

ఏమయినా తను చెప్పదల్చుకున్నది చెప్పేయడానికే నిర్ణయించుకున్నవాడిలా అన్నాడు

"అమ్మా! నువ్వు యిలా వుండద్దమ్మా! మామూలుగా ఎప్పటిలా బొట్టు పెట్టుకో."

రాజేశ్వరి మెల్లగా తలతిప్పి చూసింది, కొడుకు మొహంలోకి అయోమయంగా, అర్థం కానట్లుగా.

ఆమాత్రానికే పొంగిపోయాడు సుధాకర్. వదినగారివైపు విజయగర్వంతో చూసి మళ్ళీ రాజేశ్వరివైపు తిరిగి అన్నాడు "అవునమ్మా! ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అని ఆలోచించకు. మా అందరికీ నువు అలా ఉండడమే యిష్టం..."

తల్లి మొహంలో గబగబా మారుతున్న రంగులు చూసి ఉత్సాహంతో వళ్ళు మరచినవాడిలా అయ్యాడు సుధాకర్.

ఆ మైమరపులోనే అన్నాడు.

"అమ్మా! అసలు ఒకమాట చెప్పనా! నాన్న చనిపోయేముందు నీకోసం ఎందుకు కలవరించారనుకుంటున్నావు! ఎందుకు పిలిచారనుకుంటున్నావు! ఇందుకేనమ్మా! నాకు తెలుసు. ఈమాట చెప్పడానికే పిలిచి వుంటారు నాన్న."

అప్పుడు కనిపించింది... ఎంతోసేపటినుండీ నిశ్చలంగా వున్న రాజేశ్వరి మొహంలో ఓ వెర్రి భావం... వుద్రేకం.

అది కూడా ఒక్క క్షణమే.

ఆ మరుక్షణం మళ్ళీ ఆమె మామూలుగా అయిపోయింది. అచేతనంగా క్రిందికి వాలిపోయింది.

ఏం జరిగిందో అర్థమయ్యేందుకు ఒక్కక్షణం పట్టింది సుధాకర్ కి. అప్పటికే జానకి అత్తగారి తలని వళ్ళోకి తీసుకుని రోదిస్తోంది.

నిశ్చలంగా వున్న తల్లి కనురెప్పలు మూసేస్తూ వదినగారివైపు చూశాడు సుధాకర్. తనకు అంతా అర్థమయిందనుకుంటున్న జానకి తడికళ్ళు "నే చెప్పానా!" అన్నట్లు చూస్తున్నాయి అమాయకంగా.

*****